ఎస్సారార్‌లో రోబోటిక్స్‌పై వర్క్‌షాప్

గణేష్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో భౌతికశాస్త్ర శాఖ ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై వర్క్‌షాపును శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ వర్క్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్, ఫిజిక్స్ హెచ్‌వోడీ పి నితిన్‌పాఠక్ రోబో టిక్స్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం శ్రీనివాస్‌రెడ్డి, సోహం రిసోర్స్ పర్సన్ జిల్లా సంతోష్, అధ్యాపకులు డాక్టర్ కె రాజేష్, బి అశోక్, ఎ రాజశ్రీ, బిరాజు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో కాషాయ జెండా ఎగురవేస్తాం..

- కార్పొరేషన్‌ను మాకు అప్పగించండి... నగరమంతా రోజూ 24 గంటల నీటిని అందిస్తాం
- నేను కొట్లాడితేనే కేసీఆర్ నిధులు మంజూరు చేశారు...
- ఆర్‌వోబీ నేను తెస్తే బీఆర్‌ఎస్ నేతలు ప్రారంభించారు
- ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్



నగర మేయర్ యాదగిరి సునీల్‌రావుకు పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడు ఎన్నికలు జరిగినా కార్పొరేషన్ బీజేపీదేనని, కరీంనగర్‌లో కాషాయ జెండా ఎగురవేసి తీరుతామని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు దంపతులు, కార్పొరేటర్లు లెక్కల స్వప్నవేణు, శ్రీదేవి చంద్రమౌళి బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి కేంద్రమంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో శనివారం చేరారు. ఈ సందర్భంగా సంజయ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇది తాను గర్వంతో చెప్పడం లేదని, ప్రజల మనసుల్లోని మాటను చెబుతున్నానన్నారు. కార్పొరేషన్‌ను తమకు అప్పగిస్తే నగర వ్యాప్తంగా 24 గంటలపాటు నిరంతర నీటిని సరఫరా చేస్తామన్నారు. ఇందుకు కేంద్రం నుంచి నిధులు తెస్తామని చెప్పారు. స్మార్ట్‌సిటీ నిధులతో కరీంనగర్‌ను అభివృద్ధి చేశామని, మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. పదేళ్లుగా కేంద్రం నుంచి పెద్ద ఎత్తున నిధులు తెచ్చినా ఎన్నడూ తనను ప్రారంభోత్సవాలకు ఆహ్వానించలేదన్నారు. మేయర్ సునీల్‌రావు తనను ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తే ఆయనను పదవి నుంచి దించుతామని బీఆర్‌ఎస్ బెదిరింపులకు పాల్పడిందన్నారు. శుక్రవారం కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ నగరంలో అభివృద్ధి పనులను ప్రారంభించడంతో కేంద్రం నిధులతోనే కరీంనగర్ అభివృద్ధి చెందిందనే వాస్తవం ప్రజలకు తెలిసిందన్నారు. నిధులు తెచ్చే పార్టీకి అధికారం అప్పగిస్తే మరింత అభివృద్ధి చెందుతుందని, పనులు పారదర్శకంగా జరుగుతాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధిని ఇంకా కొనసాగించేందుకు బీజేపీకి అవకాశ మివ్వాలని, దీనిపై మేధావులు, యువకులు ఆలోచించాలని కోరారు. గత బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోయాయ న్నారు. బీఆర్‌ఎస్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ నడుస్తోందని సంజయ్ విమర్శించారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజి రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేశ్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, కొత్తపల్లి కౌన్సిలర్ వాసాల రమేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి కొనసాగాలనే బీజేపీలోకి.. : మేయర్ సునీల్ రావు

అభివృద్ధి కొనసాగాలనే బీజేపీలో చేరుతున్నానని మేయర్ సునీల్‌రావు అన్నారు. బీజేపీలో చేరిన సందర్భంగా నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఏ షరతులు లేకుండా బీజేపీలో చేరుతున్నానని, సామాన్య కార్యకర్తగా తనకు మంత్రి సంజయ్ ఏ బాధ్యత అప్పగించినా చిత్తశుద్ధితో నిర్వహిస్తానని తెలిపారు. బండి సంజయ్ నాయకత్వంలోనే కరీంనగర్ అభివృద్ధి జరుగుతోందని అన్నారు. తనకు మేయర్ పదవి రావడానికి ప్రధా న కారణం వినోద్‌కు మారేనని అన్నారు. తాను మేయర్ కాకుండా ఎమ్మెల్యే గంగుల కమలాకరేనని పలు ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. అన్ని అవమానాలను దిగమింగుకుని బీఆర్‌ఎస్‌లో ఐదేళ్ల పని చేశానని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో జరిగిన ప్రతి స్కామ్ వెనుక మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హస్తముందన్నారు. అవినీతికి కేరాఫ్ గంగుల కమలాకర్ అని విమర్శించారు. తన జోలికి వస్తే ఎమ్మెల్యే అవినీతి, అక్రమాల బండరాన్ని బయటపెడతానని హెచ్చరించారు. కరీంనగర్ అభివృద్ధికి బండి సంజయ్



మిగతా 8వ పేజీలో...

అవినీతిపై దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపిద్దాం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కరీంనగర్ టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అవినీతిపై ఎప్పుడైనా... ఎక్కడైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని, దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపిస్తే అక్రమార్కులు ఎవరో తెలు స్తుందని మాజీ మంత్రి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శనివారం గంగుల కమలాకర్ మీడియాతో మాట్లాడుతూ మేయర్ యాదగిరి సునీల్‌రావు తనపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా తన రాజకీయ జీవితంలో ఏనాడూ అవి నీతికి పాల్పడలేదన్నారు. అందుకే ప్రజలు తనను గెలిపిస్తు న్నారని తెలిపారు. ప్రజల రుణం తీర్చుకునేందుకు వందల కోట్ల రూపాయలను తీసుకువచ్చి కరీంనగర్‌ను సుందర నగరంగా తీర్చిదిద్దామన్నారు. పర్యాటకంగా అభివృద్ధి చేసేం దుకు తీగల వంతెన నిర్మాణంతోపాటు దక్షిణ భారత దేశంలోనే మొదటిగా మానేరు రివర్ ఫ్రంట్ పనులకు నిధులు తీసుకువచ్చామని చెప్పారు. అభివృద్ధి కోసమే ఆరాటం తప్ప కమీషన్ల కోసం ఆలోచించలేదని అన్నారు. మేయర్ సునీల్‌రావు తనపై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఖండించారు. పార్టీ మారడం ఆయన ఇష్టమని, అంతేగానీ తనపై అసత్యపు ఆరోపణలు చేస్తూ సహించేది లేదని అన్నారు. మా జోలికి వస్తే మేయర్‌గా దోచుకున్నదంతా కక్కిస్తామని హెచ్చ రించారు. మమ్మల్ని టచ్ చేసి చూడు నీ బండారం బయట పెడతామని, ప్రజల రక్తపు మాంసాలతో కట్టిన నీ ఇంటి గుట్టు ఆధారాలు మా దగ్గర ఉన్నాయి.. జాగ్రత్త అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

గణతంత్ర వేడుకలకు విస్తృత ఏర్పాట్లు



షామియానాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కరీంనగర్ టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీస్ కవాతు మైదానంలో ఆదివారం గణ తంత్ర వేడుకలను నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ముందుగా గణ తంత్ర వేడుకలను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించాలని నిర్ణయించడంతో అక్కడ ఏర్పాట్లు ప్రా రంభించారు. శనివారం కలెక్టర్ పమేలా సత్పతి ఎప్పటిలాగే ఈసారి కూడా పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లోనే గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించాలని, అందుకు అవస రమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జాతీయ పతాకాన్ని కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరిస్తారు. 9.02 గంటలకు గౌరవ వందన స్వీకరణ, 9.10 గంటలకు కలెక్టర్ జిల్లా ప్రజల నుద్దేశించి ప్రసంగిస్తారు. 9.25 గంటలకు స్వాతంత్ర్య సమరయోధుల సన్మానం, 9.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 10 గంటలకు వివిధ రంగాల్లోకృషిచేసిన వారికి ప్రశంసాపత్రాలు ప్రదానం చేస్తారు. 10.30 గంటలకు వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ సందర్శిస్తారు. శనివారం కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మోహంతి పోలీసు మైదానంలో గణతంత్ర వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులకు, విద్యార్థులు, ప్రజల కోసం ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వీఐపీ, ప్రజాప్రతినిధులు, మీడియా సిట్టింగ్ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. జాతీయ జెండా ఆవిష్కరణ, పోలీసులతో గౌరవ వందనం స్వీకరణ, పరేడ్, ప్రోటోకాల్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రభుత్వశాఖల స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. పరేడ్ గ్రౌండ్ చుట్టూ గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సీపీ అభిషేక్ మోహంతి పోలీసు అధికారులను ఆదేశించారు.

నేటితో ముగియనున్న మున్సిపాలిటీల పదవీకాలం

- 28న నగరపాలక సంస్థ పదవీ కాలం ముగింపు
- ఇక పట్టణాలు, నగరంలో 'ప్రత్యేక' పాలన

కరీంనగర్ టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ఆదివారంతో ముగియనున్నది. సోమవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన కోసం జిల్లా అధికారయంత్రాంగం చర్యలు చేపట్టింది. కరీంనగర్‌నగరపాలక సంస్థ పాలకవర్గం రెండు రోజుల ఆలస్యంగా పదవీ బాధ్యతలు చేపట్టడంతో మరో రెండు రోజుల తర్వాత ఈనెల 28తో పదవీకాలం ముగియనున్నది. జిల్లాలోని హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీల్లో ఆదివారం పదవీకాలం ముగుస్తుంది.

మారనున్న కరీంనగర్ ముఖచిత్రం

కరీంనగర్ నగరపాలక సంస్థలో ఈనెల 28న చిట్ట చివరి సర్వసభ్య సమావేశం, అభినందన సభలతో పాలకవర్గ పదవీకాలం ముగుస్తుంది. కరీంనగర్ నగర పాలక సంస్థలో చింతకుంట, మల్కాపూర్, బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్‌తోపాటు కొత్తపల్లి మున్సిపాలి టీల ను విలీనం చేస్తూ ప్రభుత్వం ఇటీవల గెజిట్ విడు దల చేసింది. దీంతో ఆయా గ్రామాల విలీనంతో డివి జన్ల ముఖచిత్రం పూర్తిగా మారిపోనున్నది. రిజర్వేషన్లు కూడా మారుతాయి. మరోవైపు పంచాయతీలు, ప్రాదేశిక సభ్యుల పదవీకాలం ముగిసినప్పటికీ అక్కడ ఎన్నికలు నిర్వహించలేదు. అప్పుడే మున్సిపాలిటీల్లో కూడా ఎన్ని కలు జరిగే అవకాశాలు లేవని, ఆరునెలల నుంచి ఏడా ది సమయం పట్టవచ్చని, అప్పటి వరకు ప్రత్యేక అధికారుల పాలననే కొనసాగుతుందని భావిస్తున్నారు. 2020 జనవరిలో మున్సిపల్ ఎన్నికలు జరుగగా, రెండే ళ్లు కొవిడ్,గత సంవత్సరం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్ని కలు జరుగడంతో ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేక పోయామనే భావనతో పాలకవర్గాలు ఉన్నాయి.గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేసిన అభివృద్ధి పను లకు సంబంధించిన బిల్లులు కోట్లలోనే పెండింగ్‌లో ఉన్నాయి.

క్రైం కార్నర్

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

● గొల్లపల్లి యువకుడి దుర్మరణం


గంగరాజు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికిచెందిన యువకుడు మ్యాకల గంగరాజు(26) హైదరాబాద్‌లో ఈనెల24న రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందాడని కుటుంబసభ్యులు, స్థానికులు శనివారంతెలిపారు. గ్రామంలోని మ్యాకల మల్లవ్వ-దేవయ్య దంపతుల ఒక్కడే కొడుకైన గంగరాజు నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో బైక్‌మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల24న రాత్రి పనులు ముగించుకుని గదికి వెళ్తున్న క్రమంలో వాహనం ఢీకొట్టింది. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు వెళ్లిపోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని శనివారం స్వగ్రామానికి తరలించారు. మృతుడికి తల్లిదండ్రులు మల్లవ్వ, దేవయ్య, వివాహమైన ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

చికిత్సపొందుతూ మృతి

ఇల్లంతకుంట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్జీపూర్ గ్రామానికిచెందిన అట్ల నాగభూషణం(48) చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. గ్రామస్థులుతెలిపిన వివరాలప్రకారం.. నాలుగు రోజుల క్రితం ఇల్లంతకుంట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగభూషణం తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని మొదట సిద్దిపేటకు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

గంభీరావుపేట జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నాగంపేట కమాన్ వద్ద గంజాయి అమ్ముతున్న వ్యక్తిని పట్టుకున్నట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నాగంపేట కమాన్ వద్ద ఒక వ్యక్తి బస్సులో వచ్చి అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించగా, అతనివద్ద 110గ్రాముల గంజాయి లభ్యమైందని తెలిపారు. అతన్ని విచారించగా కరీంనగర్‌జిల్లా గంగాధర మండలం ముప్పిడిపల్లి గ్రామానికి చెందిన కల్లపల్లి శ్రీనివాస్‌గా తేలిందన్నారు. నెలరోజుల క్రితం మహారాష్ట్రలోని బల్లార్షాకు చెందిన గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి అందులో కొంచెం తాగి మిగిలినది అధిక ధరకు అమ్మడానికి వచ్చినట్లు నిందితుడు తెలిపాడని ఎస్ఐ పేర్కొన్నారు. గంజాయిని సీజ్ చేసి నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్టు పేర్కొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడిపై కేసు

బీర్‌పూర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న యువకుడిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి తెలిపారు. మంచిర్యాలజిల్లా జన్నారం మండలం కలమడుగు (పోచమ్మగూడెం)కు చెందిన పరచ సురేందర్(26) అనే యువకుడు శనివారం బీర్‌పూర్ మండలంలోని మంగేళ ఎక్స్‌రోడ్డు వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీచేయగా 500గ్రాముల గంజాయి పట్టుబడిందన్నారు. గంజాయిని సీజ్ చేసి సురేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్టార్టర్ ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

శంకరపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలం కన్నాపూర్ గ్రామంలోని వ్యవసాయబావి వద్ద కరెంటు మోటర్ స్టార్టర్ ఉండే బాక్స్ తాళం పగలగొట్టి స్టార్టర్, ఆటోమెటిక్ స్టార్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని రైతు కంతాల విష్ణు శనివారం తెలిపారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కాలుష్యపు కోరల్లో రామగుండం



గోదావరిఖని, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలపై మరో పిడుగు పడనున్నది. సింగరేణి గనులు, ఓసీపీలు, ఎన్టీపీసీ, పలు పరిశ్రమలతో రామగుండం కాలుష్యపు కోరల్లో చిక్కుకుంటోంది. ఈ క్రమంలో 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంను రామగుండం ఎన్టీపీసీలో ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. 800/5 4000 మెగావాట్ల ఐదు సూపర్ థర్మల్ యూనిట్ల ఏర్పాటుకు ఎన్టీపీసీ సిద్ధమైంది. ఇందులో 800/2 1600 మెగావాట్ల విద్యుత్ కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరో 800/3 యూనిట్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.29,345 కోట్లు మంజూరు చేసింది. ఈ యూనిట్ల నిర్మాణ అనుమతుల నేపథ్యంలో పర్యావరణ అనుమతి కోసం ప్రజాభిప్రాయాన్ని ఈ నెల 28న ఎన్టీపీసీ జెడ్‌పీ స్కూల్‌లో ఏర్పాటు చేశారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కలెక్టర్ సమక్షంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగనున్నది. ఈ మూడు యూనిట్లు ప్రారంభమైతే ఈ ప్రాంతం లో వాతావరణ కాలుష్యం పెరిగి మనుగడనే ప్రశ్నార్థకం చేసే స్థాయికి చేరుకుంటోందని ఆందోళన చెందుతున్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరగ కుండా ఈ ప్రాంతంపై జరుగుతున్న పారిశ్రామిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నారు.

● ఉపాధి, ఉద్యోగాలు

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఎన్టీపీసీ విడుదల చేసిన నివేదికలో 800/3 మెగావాట్ల విద్యుత్ కేంద్రాల ఏర్పాటు ద్వారా 96శాశ్వత ఉద్యోగాలు, 216 కాంట్రాక్టు ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించింది. అయితే ప్లాంట్ల నిర్మాణ సందర్భంలో మాత్రం రెండేళ్ల పాటు 3వేల మందికి ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొంది. భారీ విద్యుత్ ప్లాంట్‌లో ఈ ప్రాంత ప్రజ లకు ఉపాధి, ఉద్యోగాల ప్రయోజనాలు కూడా కలుగడం లేదు.

● రోజూ లక్ష టన్నుల బొగ్గుమండుతున్నది...

ఎన్టీపీసీలో పాత 2400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రోజూ 40వేల టన్నుల బొగ్గు మండిస్తున్నారు. తెలంగాణ సూపర్‌థర్మల్ మొత్తం 4000మెగావాట్ల సామర్థ్యానికి రోజూ 60వేల టన్నుల బొగ్గును మండించాల్సి ఉంటుంది. అంటే రోజూ లక్ష టన్నుల బొగ్గు ఇక్కడ మండుతుంది. ఒక టన్ను బొగ్గును మండించడం వల్ల ఫ్యాటుకులేట్ మ్యాటర్(అతి సూక్ష్మ దుమ్ము, దూళికణాలు) మూడు కిలోలు వెలువడుతాయి. గాలిలో చేరడం వల్ల ఆక్సిజన్ బరువుతో వెయ్యి కిలోలు దాటి దుమ్ము, దూళి కణాలు వాతావరణంలోకి వస్తాయి. ఇదే టన్ను బొగ్గు కాల్చడం వల్ల కార్బన్ డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ వాతావరణంలో కలిసిపోతాయి. ఇవి ఈ ప్రాంత భూతాపాన్ని పెంచడంతో పాటు దీర్ఘకాలిక వాతావరణ ప్రతికూల పరిస్థితులను పెంపొందిస్తాయి. ఒక టన్ను బొగ్గు మండించడంతో సల్ఫర్ ఆక్సైడ్ కూడా 4కిలోలు వెలువడుతుంది. దీని వల్ల ఊపిరితిత్తుల వ్యాధులకు కారణమవుతోంది. ఎన్టీపీసీ చెబుతున్న లెక్కల ప్రకారమే బొగ్గు మండించడం వల్ల బొగ్గు నాణ్యతను బట్టి 40శాతం వరకు బూడిద బయటకు వస్తుంది. టన్ను బొగ్గుకు 400 కిలోల బూడిద బయటకు వస్తుంది. యేటా 36.5 మిలిటన్నుల బొగ్గును విద్యుత్ ఉత్పత్తికి విని యోగిస్తే వాతావరణ కాలుష్యం దెబ్బతినే అవకాశం ఉంది.

● డబ్ల్యూహెచ్‌ఓ చెబుతున్నది ఏమిటి...

ప్రపంచ ఆరోగ్య సంస్థ గాలిలో 15మైక్రో గ్రాముల ఏక్యూఐ ఉండాలని చెబుతున్నది. పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి 50మైక్రో గ్రాములు ఉండవచ్చు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఇప్పటికే 110 మైక్రో గ్రాముల ఏక్యూఐ ఉందని, ఇది 200, 360వరకు చేరుతున్నదని చెబుతున్నారు. ఈ కారణంగా క్యాన్సర్, గుండెపోట్లు వస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు.

● ఒక్క ఎన్టీపీసీకే యేటా 5టీఎంసీల నీరు...

ఎన్టీపీసీ పాత యూనిట్లు, తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు 4000మెగావాట్ల సామర్థ్యం కలిసి సంవత్సరానికి 5టీఎంసీల నీటిని వినియోగిస్తున్నది. నీటిని అతి ఉష్ణోగ్రత స్థాయిలో ఉడికించడం వల్లనే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. ఇప్పటికే 250 క్యూసెక్కుల నీటి సామర్థ్యం గల రిజర్వాయర్‌ను ఎన్టీపీసీ ఏర్పాటు చేసుకుంది. శ్రీపాద ప్రాజెక్టు నుంచి రూ.180కోట్ల పెట్టుబడితో నీటి వాటాను తీసుకుని తెలంగాణ ప్రాంత వ్యవసాయ రంగ నీటి అవసరాలపై కూడా ఎన్టీపీసీ ప్రభావం చూపుతున్నది.

● పీపీఏపై అనుమానాలు...

కొత్తగా 2400మెగావాట్ల మూడు యూనిట్లపై పవర్ పర్చేజ్ అగ్రిమెంట్(పీపీఏ)పై స్పష్టత రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త యూనిట్ల కేవలం 800మెగావాట్లు మాత్రమే రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తీసుకుంటామని కేంద్రానికి లేఖ రాసినట్టు తెలిసింది. ఎన్టీపీసీ వెయ్యి మెగావాట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, 600మెగావాట్లు కేంద్ర ప్రభుత్వ సూచనలతో అమ్మేందుకు సమాలోచిస్తున్నట్టు సమాచారం.

● ఎన్టీపీసీ వద్ద 11వేల ఎకరాలు...

రామగుండం ఎన్టీపీసీ నిర్మాణంతో ఈ ప్రాంతంలోని తొమ్మిది పల్లెలు కాంక్రీటు వనంలా తయారయ్యాయి. ఎన్టీపీసీ నిర్మాణం కోసం 10,800 ఎకరాలను భూసేకరణ చేసింది. దీంతో మేడిపల్లి, రాణాపూర్, ఎల్కలపల్లి, లక్ష్మీపురం, శాలపల్లి, పొరట్‌పల్లి, మల్యాల పల్లి, రాజాపరం, కుందనపల్లి ఊర్లు ప్రభావితమ య్యాయి. ఈ గ్రామాల్లోని చెరువులు, కుంటలు, పశుసంపద, భూగర్భ జల సంపద దెబ్బతిన్నది.

● ఒకే చోట 8వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి...

రామగుండం పారిశ్రామిక ప్రాంతం కేంద్రంగానే 8000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగడం పారిశ్రామిక అభివృద్ధి పరంగా గొప్ప విషయమే అయినా మానవ మనుగడను ప్రశ్నార్థకం చేసే వాతావరణ కాలుష్యం ఆందోళన కలిగిస్తున్నది. ఇప్పటికే ఎన్టీపీసీలో 500/4, 200/3 మొత్తం 2600మెగావాట్లను ఎన్టీపీసీ ఉత్పత్తి చేస్తోంది. తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు కింద 800/2 ఉత్పత్తి జరుగుతుంది. సింగరేణి జైపూర్ ప్లాంట్ 600/2 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఇప్పుడు ఎన్టీపీసీలో మరో 800/3మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి పర్యావరణ అనుమతులు జరుగుతున్నాయి. సింగరేణి, ఎన్టీపీసీ సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నది. పైగా జైపూర్‌లో 800/1, జెన్‌కో ద్వారా రామగుండంలో 800/1 థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు జరుగుతున్నది.

'బ్రాహ్మణ పరిషత్ విదేశీ విద్యానిధి పథకం రుణాలు విడుదల చేయాలి'

కరీంనగర్ కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంక్షేమపరిషత్‌కు మంజూరైన 40కోట్ల నుంచి విదేశీ విద్యానిధి పథకానికి నిధులు విడుదల చేయాలని భారతీయ బ్రాహ్మణఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శ్రీరాంభట్ల దీపక్‌బాబు ఒకప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మూడు సంవత్సరాలుగా బ్రాహ్మణ సంక్షేమపరిషత్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రుణాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే రుణాలు మంజూరుచేస్తే లబ్ధిదారులు ఆయా యూనిట్లను ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందే అవకాశం ఉందని తెలిపారు. సకాలంలో రుణాలు మంజూరు కాకపోవడంతో విదేశాల్లో ఉన్న విద్యార్థులు, పేద బ్రాహ్మణులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను బ్రాహ్మణ కార్పొరేషన్‌గా మార్చాలని కోరారు.

ఐక్యతా రాగం.. ఆపైన విమర్శలు

● స్మార్ట్‌సిటీ ఘనత తమదేనని చెప్పుకున్న నేతలు
● ఆసక్తికరంగా ప్రజాప్రతినిధుల వ్యాఖ్యలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

'నాకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో భేదాభిప్రాయాలు లేవు.... అందరం కలిసి కరీంనగర్ అభివృద్ధికి కృషిచేస్తాం.. జెండాలు, ఎజెండాలు, పార్టీలను పక్కన బెట్టి కరీంనగర్ అభివృద్ధికి పాటుపడతాం' అంటూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఐక్య తారాగాన్ని ఆలపించడం జిల్లారాజకీయాల్లో ఆసక్తికర చర్చకు తెరతీసింది. బండి సంజయ్‌కుమార్ ప్రసంగించిన వేదికపైనేవచ్చిన స్మార్ట్‌సిటీ ప్రస్తావన నేతల అంతరంగాలను ఆవిష్కరించింది.

స్మార్ట్‌సిటీకి నిధులు తీసుకువచ్చి, కరీంనగర్‌ను అభివృద్ధి చేసింది కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారేఅని మేయర్ యాదగిరిసునీల్‌రావు అన్నారు. ఆ క్రెడిట్‌ను ఆయనఖాతాలో వేయడానికి అంగీకరించని రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ స్మార్ట్‌సిటీకి మాజీ ఎంపీ బోయినపల్లివినోద్‌కుమార్ చేసిన కృషితోపాటు తాను ఎంపీగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి కూడా కారణమని అన్నారు.

మాజీమంత్రి, ఎమ్మెల్యే గంగులకమలాకర్ మాట్లాడుతూ ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఎంపీ వినోద్ కుమార్‌తోకలిసి తాను ఢిల్లీవెళ్లి స్మార్ట్‌సిటీ జాబితాలో కరీంనగర్‌ను చేర్పించేందుకు చేసిన ప్రయత్నం ఫలించిందని స్మార్ట్‌సిటీని తమఅకౌంట్‌లో వేసుకున్నారు.

అటుబీజేపీ, ఇటుకాంగ్రెస్, బీఆర్ఎస్‌నేతలు ఎవరికివారు స్మార్ట్‌సిటీని తేవడం తమ ఘనతేనని చెప్పుకోవడంతో స్మార్ట్‌సిటీ పనుల్లో జరిగిన అక్రమాల మాటేమిటనే చర్చ జోరుగా సాగుతున్నది. బీఆర్ఎస్ మేయర్‌గా సునీల్‌రావు, ఎమ్మెల్యేగా, మంత్రిగా గంగుల కమలాకర్, ఎంపీగా బండి సంజయ్‌కుమార్ ఉన్న సమయంలో స్మార్ట్‌సిటీ పనులు జరిగాయి. ఈ పనుల్లో అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసిన విషయాన్ని నగర ప్రజలు గుర్తుచేసుకొని చర్చించుకుంటున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్‌సిటీ, పట్టణ ప్రగతి నిధులతో చేపట్టిన పనులతోపాటు మానేరు రివర్‌ఫ్రంట్‌పనుల్లో అక్రమాలు జరిగాయని విచారణ చేపిస్తామని రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆరోపణలు, ప్రత్యారోపణలు అలా ఉండగానే మేయర్ సునీల్‌రావు బీజేపీలో చేరాయి. మామధ్య ఎలాంటి విబేధాలులేవు కలిసి పనిచేస్తామంటూ కేంద్రమంత్రి పేర్కొనడంతో స్మార్ట్‌సిటీ అవినీతిఅంశం అటకెక్కినట్టేనా అని అనుకుంటున్నారు.

మెట్‌పల్లి సీఐకి ఇండియన్ పోలీస్‌మెడల్


సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యున్నత సేవలు అందించే ప్రభుత్వ అధికారులకు కేంద్ర ప్రభుత్వం అందించే ఇండియన్ పోలీస్ మెడల్‌కు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి ఎంపికయ్యారు. పోలీస్‌శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డికి హైదరాబాద్‌లో జరిగే గణతంత్ర వేడుకల్లో ఇండియన్ పోలీస్‌మెడల్‌ను ప్రకటించనున్నారు. ఈ సందర్భంగా సీఐ నిరంజన్‌రెడ్డికి జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కేకేనగర్‌లో కార్డన్ సెర్చ్

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి వెంకట్రావ్‌పల్లె పంచాయతీ కేకేనగర్‌లో శనివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారు జామున పోలీస్ బృందాలు ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు లేని ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్థులను ఉద్దేశించి సీఐ ప్రసాదరావు మాట్లాడారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాహన దారులు అన్ని రకాల ధృవీకరణ పత్రాలు కల్గి ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీఐ-2 లింగమూర్తి, ఎస్సైలు ప్రసాద్, రవళి, సిబ్బంది కలీల్, కృష్ణారెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న వాహనాల వద్ద యజమానులతో మాట్లాడుతున్న సీఐ

వివాహిత ఆత్మహత్యాయత్నం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి రాజీవ్‌నగర్‌తండాకు చెందిన తేకల సౌజన్య అత్తింటి వేధింపులు భరించలేక ఇంట్లో ఉన్న మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. అస్వస్థతకుగురైన సౌజన్యను కుటుంబసభ్యులు గోదావరి ఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. ఆత్మహ త్యాయత్నానికి ముందు సెల్ఫీ వీడియో తీసింది. సౌజన్య భర్త అనురాగ్ ఏడాదిక్రితం గుండెపోటుతో మరణించాడు. తండ్రిఉద్యోగం వచ్చే క్రమంలోనే అనురాగ్ మృతిచెందాడు. తమకు రావాల్సినఉద్యోగం అత్త మామలు కుమార్తెకు ఇప్పించుకుని తనకు అన్యాయం చేశారని, ఎటువంటి ఆధారంలేని తనను నిత్యంసూటి పోటిమాటలతో వేధించడంతో జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్యకు పాల్పడుతు న్నట్టు సౌజన్య వీడియోలో పేర్కొన్నది.

విద్యార్థినికి పలువురి సన్మానం

గన్నేరువరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఇంగ్లీష్ ఉపన్యాసపోటీలో మండల కేంద్రంలోని జడ్పీఉన్నత పాఠశాలకుచెందిన విద్యార్థిని పత్తి వైశాలి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. దీంతో పలువురు నాయకులు శనివారం విద్యార్థినిని, ఉపాధ్యాయబృందాన్ని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో రామయ్య, నాయకులు పుల్లెలజగన్, వేణుగోపాల్, కాంతాల అంజిరెడ్డి, సందవేణి ప్రశాంత్, రేపాకబాబు, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి


సంపత్(ఫైల్)

తిమ్మాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో రాజీవ్‌రహదారిపై లారీఢీకొని ఒకరు మృతి చెందారు. ఎల్ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ మండలంలోని పర్లపల్లి గ్రామానికి చెందిన గట్టు సంపత్(24) అలుగునూరులోని రైస్ మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతడి తల్లిదండ్రులు గతంలోనే చనిపోయారు. పర్లపెల్లిలో తన అన్నతో కలిసి ఉంటున్నాడు. శనివారం గట్టు సంపత్ కొత్తపల్లి శివారులో కరీంనగర్ వైపు వస్తూ రోడ్డుకు పక్కన తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి డివైడర్ పైనుంచి రోడ్డు దాటుతున్నాడు. ఈక్రమంలో కరీంనగర్ వైపు నుంచి హైదరాబాద్ వైపు బూడిదలోడుతో వెళుతున్న లారీ సంపత్‌ను ఢీకొంది. దీంతో సంపత్ లారీ టైర్ కింద పడగా తీవ్రగాయాలై సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో దాడి.. ఇద్దరికి గాయాలు

మల్యాల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఇరు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో బావమరుదులపై బావ కత్తితో దాడి చేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన గుండోజి చంద్రశేఖర్‌తో జగిత్యాలకు చెందిన అనసూరి నవ్య వివాహం 2021లో జరిగింది. ఏడాది తరువాత కుటుంబ కలహాలతో జగిత్యాల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వరకట్న వేధింపుల కేసు నమోదైంది. ఇరు కుటుంబాల మధ్య ఆదివారం పంచాయితీ ఉంది. ఈ నేపథ్యంలో శనివారం నవ్యతో పాటు ఆమెతండ్రి, సోదరులు ముత్యంపేటకు వచ్చారు. ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి దాడులకు దారి తీసింది. ఈ క్రమంలో చంద్రశేఖర్ తన బామ్మర్దులు శివసాయి, నవీన్‌కుమార్‌పై కత్తితో దాడి చేయడంతో గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని 108లో చికిత్సకోసం ఆసుపత్రికి తరలించారు.

బాధితుల ఫిర్యాదుతో ఎస్సై నరేశ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ..

● 35తులాల బంగారం, 80తులాల వెండి, రూ.3.50లక్షల నగదు దొంగతనం
● రంగంలోకి దిగిన రెండు పోలీసు టీంలు
● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన టౌన్ ఏసీపీ

కరీంనగర్ క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని అశోక్‌నగర్‌లో తాళంవేసిన ఇంటిలో శనివారం గుర్తు తెలియని దొంగలు చొరబడి భారీగా బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించుకుపోయారు. కరీంనగర్ ఒకటోటౌన్ సీఐ బిల్లకోటేశ్వర్, బాధితులు కథనం ప్రకారం.. సహకారశాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా ఉద్యోగం చేసి పదవీవిరమణ పొందిన మురుగం అంజని అశోక్‌నగర్‌లో నివాసం ఉంటోంది. ఆమెకు ఇద్దరుకూతుళ్లు ఉన్నారు. మురుగం అంజని ఇంటికి తాళంవేసి తన సోదరుడితో కలిసి శనివారం ఉదయం వరంగల్‌కు వెళ్లింది. పనిముగించుకుని సాయంత్రం తిరిగి కరీంనగర్‌కు వచ్చింది. ఇంటికి వెళ్లి చూసేసరికి ఇంటి వేసిన తాళం వేరేది ఉంది. పక్కనే ఉంటున్న ఆమె తల్లిని అడగగా తలుపులు తెరచి ఉండటంతో తానే తనవద్ద తాళం వేశానని తెలిపింది. దీంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరచి ఉంది. బీరువాలో భద్రపరిచిన 35తులాల బంగారు ఆభరణాలు, 80తులాల వెండి ఆభరణాలు, రూ.3 లక్షల 50వేలనగదు కనపడలేదు. ఇంటిలో మరోచోట భద్రపరిచిన మరికొంత బంగారం మాత్రం భద్రంగానే ఉంది. గుర్తుతెలియని దొంగలు తాళం పగులగొట్టి ఇంటిలోకి చొరబడి బీరువాలోని బంగారం, వెండి, నగదు దొంగిలించుకుపోయారని బాధితురాలు కరీంనగర్ ఒకటోటౌన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని టౌన్ ఏసీపీ వెంకటస్వామి పరిశీలించారు. క్లూస్ టీంతో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. చోరీజరిగిన ఇంటి సమీపంలోని పలు సీసీకెమెరాలను పోలీసు టీంలు తనిఖీ చేస్తున్నాయి. నిందితులను పట్టుకునేందుకు రెండు పోలీసు టీంలు రంగంలోకి దిగి పలువురు అనుమానితులను విచారిస్తున్నారు. పగటిపూటనే భారీ దొంగతనం జరగడంతో తెలిసినవారే ఈచోరీ చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు పలుకోణాల్లో విచారణ జరుపుతున్నారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గంజాయి క్రయవిక్రయాల కేసులో సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌లో నలుగురిని శనివారం అరెస్ట్‌చేశామని టౌన్‌సీఐ కె కృష్ణ తెలిపారు. పట్టణంలోని విద్యానగర్ సమీపంలోగల శ్మశానవాటిక వద్ద గంజాయి క్రయవిక్రయాలకు పాల్పడుతున్న సాయినగర్‌కు చెందిన షేక్‌షారుక్‌ఖాన్(25), శాంతినగర్‌కుచెందిన మూషం శివకుమార్(22), గడదాస్‌శివ(24), బివైనగర్‌కు చెందిన మహ్మద్‌గౌస్(22)లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. వీరివద్ద 200గ్రాముల గంజాయిని, నాలుగు మొబైల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నాలుగురోజుల క్రితం కరీంనగర్‌లోని ఆర్టీసీ బస్టాండ్ వద్దకు వెళ్లి రూ.10వేలకు 400 గ్రాముల గంజాయిని షేక్‌షారుక్ ఖాన్ కొనుగోలుచేసి సిరిసిల్లలోని తన పరిచయస్తులకు 150గ్రాముల గంజాయిని విక్రయించాడన్నారు. మిగిలిన 250గ్రాముల గంజాయిని తనవద్దనే పెట్టుకొని 50గ్రాముల ప్యాకెట్లు చేసుకున్నాడన్నారు. ఇందులో 50 గ్రాముల గంజాయినితాగి మిగతా మూడు ప్యాకెట్లు మూషం శివకుమార్, మహ్మద్ గౌస్, గడదాస్‌శివకు రూ.4500కు విక్రయించాడన్నారు. ఇదేసమయంలో సమాచారం రావడంతోవెళ్లి అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసి నలుగురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయిని అక్రమంగా రవాణా చేసినా కొనుగోలుచేసినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

బైపాస్ రోడ్‌లో అఘోరీమాత హల్‌చల్


పెద్దపల్లి బైపాస్‌రోడ్‌లో కారు వద్ద నిలుచున్న అఘోరీమాత

కరీంనగర్ క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా వార్తల్లో నిలుస్తున్న అఘోరీ మాత శనివారం రాత్రి కరీంనగర్ శివారులోని బొమ్మకల్ బైపాస్‌రోడ్‌లో కొద్దిసేపు హల్‌చల్ చేశారు. కారులో వెళతుండగా కొందరు అకతాయిలు అఘోరీమాతను అడ్డుకుని సెల్ఫీ తీసుకోవాలని ఒత్తిడి తేవటంతో వాగ్వాదం జరిగింది. ఆకతాయిలు ఆమె కారుకు వారి కారును అడ్డుపెట్టి అడ్డుకున్నారు. 100కు కాల్ చేయటంతో సమాచారం అందుకున్న కరీం నగర్ మూడో టౌన్ సీఐ జాన్‌రెడ్డి తన సిబ్బందితో సహాఅక్కడికి చేరుకుని అఘోరీమాతను అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించగా ఆమె పెద్దపల్లి వైపు తన కారులో వెళ్లింది. అఘోరీ కరీంనగర్‌లోనే రెండు రోజులుగా ఉంటున్నట్లు సమాచారం. పోలీసుల రాకను గమనించిన ఆకతాయిలు కారును అక్కడే వదిలేసి పారిపోయారు. కారును పోలీసులు ఠాణాకు తరలించారు.

డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తి అరెస్టు

శంకరపట్నం, జనవరి25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి చిట్‌ఫండ్ డబ్బులు ఇవ్వకుండా మోసం చేసినవ్యక్తిని కేశవపట్నం పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన జన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డికి హుజూరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన చిట్‌ఫండ్ నిర్వాహకుడు వేముగంటి శ్రీనివాస్‌ద్వారా రూ.4.64లక్షలు రావాల్సిఉంది. చిట్టిడబ్బులు ఇవ్వకుండా మోసం చేసినందుకు చిట్‌ఫండ్ యాక్టులో కేసు నమోదు చేసి, వేముగంటి శ్రీనివాస్‌ను అరెస్టుచేసి హుజూరాబాద్ కోర్టుకు రిమాండ్ నిమిత్తం తరలించినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వెల్గటూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని ఎండపల్లికి చెందిన సూరఉదయ్‌కిరణ్(24) అనే యువకుడు చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. ఎస్సైఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం ఉదయ్‌కిరణ్ ఈనెల 21న తన స్నేహితుడు కనుకుంట్ల రవితేజతోకలిసి ద్విచక్ర వాహనంపై కొండాపూర్ వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డారు. ఈసంఘటనలో ఉదయ్‌కిరణ్ తలకు తీవ్రగాయాలుకాగా కరీంనగర్ ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతిచెందాడు. మృతుడితండ్రి కుమార స్వామిఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామం మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. వాహనాలతనిఖీల్లో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఓ ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా, అనుమతి పత్రాలు చూపాలన్నారు. ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో అదుపులోకి తీసుకొని డ్రైవర్ ఏరుకొండ మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మోదీ పాలనలోనే అన్ని వర్గాల అభివృద్ధి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తాచాటాలి - కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పాలనలోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తాచాటి రెండు స్థానాలను కైవసం చేసుకునే దిశగా పనిచేయాలన్నారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను ఇంటింటికీ ప్రచారం చేసి ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్లు అభ్యర్థించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో చేసిన మోసాలను ఓటర్లకు వివరించాలన్నారు. నిరుద్యోగభృతి, 2 లక్షల ఉద్యోగాల భర్తీ, పీఆర్సీ పెంపు, 317 జీవో సవరణ, డీఏ బకాయిల చెల్లింపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను తుంగలో తొక్కిన అంశాన్ని విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్క కొమురయ్య, గోదావరి అంజిరెడ్డిలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పరిచయం చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్క కొమురయ్య, గోదావరి అంజిరెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామక్రిష్ణ, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీమేయర్ డి శంకర్ పాల్గొన్నారు.


లీగల్ ఎయిడ్ ద్వారా ఖైదీల పిల్లలకు సాయం అందిస్తాం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి ప్రతిమ

కరీంనగర్ క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జైలులో ఉన్న ఖైదీల పిల్లలకు లీగల్ ఎయిడ్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి ప్రతిమ అన్నారు. శనివారం కరీం నగర్ జైలులో ఖైదీల హక్కులు, బాధ్యతలు, ఖైదీలకు అందిస్తున్న న్యాయసేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి ప్రతిమ మాట్లాడుతూ ఖైదీలు పిల్లల చదువు నిర్లక్ష్యం చేయవద్దని, వారు ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా విద్య అందించాలన్నారు. ఖైదీలు మానసికంగా దృఢంగా ఉండాలని, అధైర్య పడకూడదని సూచించారు. ముద్దాయిలు స్వయంగా, వ్యక్తిగతంగా మార్పు చెందాలని అన్నారు. పేద ఖైదీలకు ప్రభుత్వ న్యాయ వాదులను నియమించి న్యాయ సహాయాన్ని అందిస్తామని అన్నారు. ఖైదీల హక్కులు, బాధ్యతలను వారికి అందిస్తున్న న్యాయ సహాయం గురించి ప్రధాన న్యాయమూర్తి వివరించారు. ఖైదీలు నేరాలు చేయకుండా సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని కోరారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తరువాత కొత్త జీవితాన్ని ప్రారంభించి సరైన మార్గంలో నడవాలని సూచించారు. జైలులో ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాల గురించి సంతృప్తి వ్యక్తం చేస్తూ జైలు అధికారులను, సిబ్బందిని అభినందించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేష్ మాట్లాడుతూ జైలుకు వచ్చిన ఖైదీల సమస్యలను తెలుసుకుని వారికి న్యాయ సేవా పరంగా అవసరమైన సహకారాన్ని అందిస్తున్నామని, లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా లీగల్ అడ్వకేట్‌లను జైలుకు పంపించి సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. అవగాహన కార్యక్రమంలో జిల్లా జైలు సూపరిండెంట్ కె శ్రీనివాస్, జైలు వైద్యాధికారి కె వేణుగోపాల్, జైలర్ పి శ్రీనివాస్, బి రమేష్, యు పరశురాం, డిప్యూటీజైలర్‌లు ఏ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ సుధాకర్‌రెడ్డి, ఎల్ రమేష్ నాయక్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ తనుకు మహేష్, పి పరశురాములు, ఎస్ మల్లేశం, జ్యోతి, ఖైదీలు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో రాచర్ల కోట



ఆనవాళ్లు కోల్పోయిన రాచర్లకోటలోని సింహ ద్వారం(వెనుక దిడ్డి)

- కాల గర్భంలో కనుమరుగవుతున్న అద్భుత కట్టడం
- నాటి నైపుణ్యానికి స్మృతి చిహ్నంగా శిల్ప ఖండాలు
- మాయమవుతున్న చారిత్రక సంపద.. పట్టించుకునే వారు కరువు

ఎల్లారెడ్డిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలో ప్రాచీన వారసత్వ సంపదకు ఆదరణ కరువైంది. మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని రాచర్ల కోట నిర్లక్ష్యానికి గురవుతోంది. గుప్త నిధుల వేట.. కబ్జాదారుల స్వార్థం.. అధికారుల అలసత్వం.. వెరసి.. ఆనాటి సంస్కృతులను ప్రతిబింబించే అద్భుత కట్టడం కాలగర్భంలో కలిసిపోతోంది. అపురూపమైన శిల్ప కళా సంపద కనుమరుగైపోతోంది. పూర్వీకుల నుంచి వారసత్వంగా సంక్రమించిన సంపదను భావితరాలు భౌతికంగా తిలకించలేని దుస్థితి నెలకొంది.

● ఉనికి కోల్పోయిన గత వైభవం..

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని రాచర్ల కోటకు శతాబ్దాల చరిత్ర ఉంది. కాకతీయుల సామ్రాజ్యానికి కోట వేదికగా నిలిచింది. సింగమ మహారాజు రాచర్ల పట్టణాన్ని పరిపాలించాడని చారిత్రక ఆధారాలున్నాయి. ఆసమయంలో చారిత్రక కట్టడాలు, దేవాలయం నిర్మించారు. అద్భుత శిల్ప కళాకృతులు రూపొందించారు. శత్రురాజుల దాడి నుంచి రాజ్యాన్ని కాపాడుకోవడానికి కోట చుట్టూ ఎత్తయిన ప్రహరీని నిర్మించారు. దానికి అవతలి వైపు కోట చుట్టూ తీసిన లోతైన కందకంలో ఎల్లప్పుడు నీరు ఉండేలా చేసి శత్రు దుర్భేద్యంగా మార్చారు. కోటకు పడమర దిశలో ఉన్న సింహద్వారానికి (వెనుక దిడ్డి) ఆనుకుని ఓ చెరువు, ద్వారం పక్కనే



శిథిలమైన శివాలయం

అబ్బురపరిచే రాతి శిల్పాలతో నిర్మితమైన శివాలయం ఉన్నాయి. సింగమ మహారాజు కోటలోని రహస్యాన్ని తెలుసుకున్న గోల్కొండ రాజు దండయాత్ర చేసి సామ్రాజ్యాన్ని అంతం చేశాడని చరిత్రకారులు చెబుతున్నారు. శతాబ్దాల కాలం నాటి శిల్ప కళా నైపుణ్యం మధుర స్మృతులు కాలక్రమేణా కనుమరుగైపోయాయి. కోటలోని కళా ఖండాలను నిజాం సర్కారు హైదరాబాద్‌లోని సాలార్జంగ్ మ్యూజియానికి తరలించారని స్థానికులు పేర్కొంటున్నారు. మరికొన్ని రాతి స్థూపాలను చుట్టు పక్కల గ్రామాల్లోని ఆలయాల నిర్మాణాలకు వినియోగించారు. శిల్ప కళా సంపద అవశేషాలు కోటలో అక్కడక్కడా విసిరేసినట్లు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. నాటి సంపద కోటలో మిగిలిపోయిందని కొందరు గుప్త నిధుల కోసం ఆ ప్రాంతంలో తవ్వకాలు చేపట్టిన సంఘటనలు ఉన్నాయి. సాంస్కృతిక ఆనవాళ్లను అక్రమార్కులు దర్జాగా కబ్జా చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదని చరిత్రకారులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

● గ్రామాలకు ముందు 'రాచర్ల'

గోల్కొండ రాజు కోటపై దండయాత్ర చేయడంతో ప్రజలు ప్రాణభయంతో పారిపోయి పరిసర ప్రాంతాల్లో స్థిర నివాసాలను ఏర్పర్చుకున్నారు. దాంతో ఆ గ్రామాల పేర్లకు ముందు 'రాచర్ల' చేరిపోయింది. తద్వారా వెలసిన రాచర్ల గొల్లపల్లి, రాచర్ల బొప్పాపూర్, రాచర్ల తిమ్మాపూర్, రాచర్ల గుండారం గ్రామాలు అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని రాచర్ల కోటలో చారిత్రక సంపదను రక్షించాలని స్థానికులు, చరిత్రకారులు కోరుతున్నారు.

మా ఇంటి పేరే రాచర్ల..

- రాచర్ల రఘురామశర్మ, పురోహితుడు, రాచర్లగొల్లపల్లి



రాచర్ల కోట సింగమ మహారాజు పరిపాలనలో తమ వంశస్థులు గురువులుగా ఉన్నారని మా తాతలు చెప్పేవారు. రాచర్ల కోటలో గురువులుగా ఉండడం వల్ల మా ఇంటి పేరు రాచర్లగా మారిందని చెబుతుండేవారు. అప్పటి నుంచి మా ఇంటి పేరు రాచర్లగా వస్తోంది.

కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి..

- వాసరవేణి పర్శరాములు, పరిశోధకులు, సింగారం



రాచర్ల కోటను అధికారులు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. చారిత్రక సంపదను కాపాడడంతో పాటు కోట ప్రాంతంలోనే మ్యూజియం ఏర్పాటు చేయాలి. నాటి శిల్ప ఖండాలను భద్రపరిస్తే భవిష్యత్తు తరాలకు గత చరిత్ర తిలకించే, తెలుసుకునే అవకాశాలుంటాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీఎఫ్‌వో

కొడిమ్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల డీఎఫ్‌వో ఎం రవిప్రసాద్ సూచించారు. రెండురోజుల క్రితం మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో గుడిసెలో కట్టేసిన ఆవు పెద్దపులి దాడిలో మృతి చెందింది. శనివారం జగిత్యాల డీఎఫ్‌వో అటవీ అధికారులతో పెద్దపులి సంచరించి, ఆవుపై దాడిచేసిన అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో గ్రామస్థులతో మాట్లాడుతూ బాధితుడికి ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందిస్తామన్నారు. సంఘటన స్థలంలో పెద్దపులి అడుగులు ఉన్నట్లు తాము గుర్తించామన్నారు. పొలాలకు వెళ్లేటప్పుడు ఎక్కువ మంది కలిసి వెళ్లాలన్నారు. అనంతరం కొడిమ్యాల రేంజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పెద్దపులి తిరిగిన ఆనవాళ్లు ఎక్కడ కనిపించినా తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ప్రజలు ఎలాంటి భయాన్ని పెట్టుకోవద్దని గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్, డీఆర్వోలు ముషీర్‌అహ్మద్, మోనిక, సెక్షన్ ఆఫీసర్లు రత్నమ్మ, సుబ్బారావు, బీట్ అధికారులు ఆనందరావు, ప్రవీణ్, అశ్విని, ఫిరోజ్, ఉన్నారు.



పెద్దపులి అడుగులను పరిశీలిస్తున్న సిబ్బంది

25 రోజులు.. నలుగురు ఈవోలు

- కొండగట్టు దేవస్థానంలో నియామకం
- ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టిన కృష్ణప్రసాద్



డి కృష్ణప్రసాద్

మల్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో 25 రోజుల వ్యవధిలో నలుగురు ఈవోలుగా బాధ్యతలు చేపట్టారు. తాజాగా శనివారం ఆలయ ఇన్‌చార్జి ఈవోగా డి కృష్ణప్రసాద్ చేరారు. ఈనెల 3న ఇక్కడి ఈవో రామకృష్ణరావు బదిలీతో వేములవాడ ఈవో వినోద్‌రెడ్డి ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. ఆయన స్థానంలో ఈవోగా టి శ్రీకాంతరావును దేవాదా యశాఖ నియమించగా ఈనెల 18న విధుల్లో చేరారు. అనంతరం మూడు రోజుల్లోనే నెలరోజుల సెలవుపై వెళ్లారు. తాజాగా హైదరాబాద్‌లో దేవాదాయశాఖలో డిప్యూటి కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న డి కృష్ణప్రసాద్‌ను ఇన్‌చార్జి ఈవోగా నియమించడంతో శనివారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. దీంతో ఇరవైఐదు రోజుల్లో నలుగురు ఈవోలు బాధ్యతలు చేపట్టినట్లు అయింది. అంతకుముందు ఈవో కృష్ణప్రసాద్ ఆలయంలో అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. కృష్ణప్రసాద్ గతంలో ఇక్కడ రెగ్యులర్ ఈవోగా విధులు నిర్వహించారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు

- బాలికల విభాగంలో రూరల్ చాంపియన్‌షిప్ సాధించిన కరీంనగర్



ట్రోఫీతో కరీంనగర్ పాలిటెక్నిక్ కళాశాల బాలికల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి పాలిటెక్నిక్ కళాశాల క్రీడా పోటీలు శనివారం సాయంత్రం ముగిశాయి. రెండు రోజులుగా జిల్లా కేంద్రానికి సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీల్లో బాలికల విభాగంలో అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాల కరీంనగర్, బాలుర విభాగంలో ఎస్సార్‌ఆర్‌ఎస్ పాలిటెక్నిక్ కళాశాల సిరిసిల్ల ఓవరాల్ చాంపియన్‌షిప్‌లను సాధించాయి.

పోటీల ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి శివరాణి హాజరై విజేతలకు బహుమతులను, ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను ప్రదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. క్రీడాకారులు భవిష్యత్తులో చిన్న చిన్న విషయాలకు కుంగిపోకుండా ధైర్యంతో ముందుకు సాగాలన్నారు. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు అధికారులందరికీ ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పించామన్నారు. 600 మంది క్రీడాకారులు రెండు రోజులపాటు వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, తదితర క్రీడాంశాల్లో పాల్గొని ప్రతిభ చాటారన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు కే వెంకటేశ్వర్లు, ఎం చంద్రప్రకాశ్, బి ఝాన్సీ, సీహెచ్ స్వప్న, ఏవో నజీముద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ జి తుల్జారాం షా, తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో హెచ్‌ఎంకు బహుమతి



బహుమతి అందుకుంటున్న హెచ్‌ఎం

రాయికల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆరురాష్ట్రాల దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో రాయికల్ మండలం కుమ్మరిపెల్లి ప్రధానోపాధ్యాయుడు కడకుంట్ల అభయ్ రాజ్ బహుమతి అందుకున్నాడు. ఈ నెల 21 నుంచి 25 వరకు పుదుచ్చేరిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో అభయ్ రాజ్ రూపొందించిన తక్కువ ఖర్చు, ఖర్చు లేని బోధనోపకరణాలతో కూడిన సూపర్ సైన్స్ కిట్‌కు ప్రత్యేక బహుమతి లభించింది. ఈ సందర్భంగా పుదుచ్చేరి ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రియదర్శిని, జాయింట్ డైరెక్టర్ శివగామి చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు. అభయ్‌రాజ్‌ను జిల్లా విద్యా శాఖాధికారి రాము, జిల్లాసైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు అభినందించారు.


త్యాగధనుల స్మరణ.. కొలనూరులో కొనసాగుతున్న నిత్య జనగణమన



కొలనూరులో నిత్య జనగణమన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు (ఫైల్)

కోనరావుపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా కొలనూర్‌లో మొట్టమొదటిసారిగా త్యాగధనులను స్మరిస్తూ నిత్య జనగణమనను గ్రామస్థులు కొనసాగిస్తున్నారు. కోనరావుపేట మండలం కొలనూరులో 2018లో నిత్య జనగణమన కార్యక్రమాన్ని అప్పటి కలెక్టర్ కృష్ణభాస్కర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆనాటి నుంచి నిత్య జనగణమనను కొనసాగిస్తున్నారు. ఉదయం 8 గంటలకు గ్రామపంచాయతీ మైకు ద్వారా జనగణమన సైరన్ రాగానే ఎక్కడ ఉన్న గ్రామస్థులు అక్కడే నిలబడి నిత్య జనగణమనలో పాల్గొంటున్నారు. అప్పటి సర్పంచ్ అబ్దుల్ రషీద్, డీపీఆర్‌వో మామిండ్ల దశరథం, ఇతర అధికారుల సమక్షంలో జనగణమన ప్రారంభమై ఇప్పటికీ కొనసాగుతోంది.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



ధర్మపురి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. పుష్య మాసం సందర్భంగా క్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చారు. స్థానిక లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ రామలింగేశ్వస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. భక్తులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తగు సేవలు అందించారు.

● అంజన్న ఆలయంలో..

మల్యాల (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో శనివారం భక్తులతో రద్దీ నెలకొంది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

● 30న హుండీల లెక్కింపు

ఈ నెల 30 ఆలయ హుండీల ఆదాయంను లెక్కింపు చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇటీవల ఈవో మార్పుతో లెక్కింపునకు ఆలస్యం కాగా నూతన ఈవో బాధ్యతలు చేపట్టడంతో గురువారం లెక్కింపునకు నిర్ణయించారు.



కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో భక్తులు

మొక్కజొన్నలో కత్తెర పురుగు

- పీచు దశలో దెబ్బతింటున్న పంట
- మందులు పిచికారి చేసినా అదుపు కావడం లేదంటున్న రైతులు



సైదాపూర్ మండలంలోని రాంచంద్రాపూర్‌లో పీచు దశకు చేరుకున్న మొక్కజొన్న



మొక్కజొన్నను తింటున్న కత్తెరపురుగు

సైదాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంట పీచుదశలో కత్తెర పురుగు సోకుతోంది. పురుగు మందులు పిచికారి చేసినా కత్తెర పురుగు అదుపు కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సైదాపూర్ మండలం మెట్ట ప్రాంతం కావడంతో చాలా మంది రైతులు ఆరుతడి పంట అయిన మొక్కజొన్న పంట సాగు చేశారు. పత్తి పంట చేతికి రావడంతో ఆ మొక్కలు తీసివేసి మొక్కజొన్న వేశారు. మండలంలో ఈ యాసంగి సీజన్‌లో నాలుగువేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగవుతోంది. వాతావారణ పరిస్థితో.. మరే కారణమో.. మొక్కజొన్నకు పీచుదశలో కత్తెరపురుగు సోకింది. ఈ పురుగు మొక్కజొన్న కర్రలను పూర్తిగా తినేస్తోంది. ఆ కత్తెర పురుగు సోకిన కర్ర స్ప్రే చేసినా కోలుకునే అవకాశం లేదు. రెండున్నర నెలలుగా కష్టపడి మొక్కజొన్నను పీచు దశకు తీసు వస్తే చివరిదశలో కత్తెరపురుగు రావడం రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇంకో నెల రోజులు అయితే పంట చేతికి వచ్చే సమయంలో చీడ పీడలు ఆశించడం ఇబ్బందిగా ఉందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయాధికారులు స్పందించి ప్రత్యామ్నాయ మార్గం చూపాలని రైతులు కోరుతున్నారు.

● కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి సైదాపూర్ మండల వ్యవసాయశాఖ అధికారి వైదేహి వివరించారు.

- మొక్కజొన్న విత్తిన వెంటనే ఎకరానికి 10-15 లింగాకర్షన బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి.
- విత్తిన 7-10 రోజుల తర్వాత వేప నూనె (అజాడిరక్టిన్ 1500 పీపీఎం) లీటర్, ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి మందు మొత్తం మక్క సుడులలో పడే విధంగా పిచికారి చేయాలి.
- పురుగు తీవ్రతను బట్టి పంట విత్తిన 20-25 రోజుల తర్వాత క్లోరాంట్రానిలిప్రోల్ 80 మిల్లీలీటర్లు, వేపనూనె (అజాడిరక్టిన్ 1500 పీపీఎం) ఒక లీటరు, 200లీటర్ల నీటిలో కలిపి మొక్కలు మొత్తం పూర్తిగా తడిచేలా పిచికారి చేయాలి.
- పురుగు కనిపించిన వెంటనే పొడి ఇసుకను మొక్కజొన్న సుడులలో చల్లితే ఇసుక రాపిడికి లార్వాలు చనిపోతాయి. చిక్కటి ఎర్రమట్టి బురద నీటిని మొక్కజొన్న మొక్క మొవ్విలో పోస్తే కత్తెర పురుగు లార్వాలు ఊపిరి ఆడక చనిపోతాయి.
- ఎదిగిన లార్వా నివారణకు విషపు ఎరను మొక్క సుడిలో ఏర్పాటు చేసుకోవాలి

● విషపు ఎర తయారీ విధానం:

ఎకరానికి 10 కిలోల తవుడు, 2 కిలోల బెల్లం తీసుకొని బెల్లాన్ని 2-3 లీటర్ల నీటిలో కరిగించి తవుడులో కలిపి 24 గంటలు పులియనివ్వాలి. అరగంట ముందు ఈ మిశ్రమానికి వంద గ్రాముల థయోడికార్బ్ మందును కలిపి విషపు ఎరను మొక్క సుడిలో వేయాలి.

● జీవనియంత్రణ పద్ధతులు

కత్తెర పురుగు నివారణకు జీవ కీటక నాశినులైన నోమేరియా రిలే లేదా మెటారైజియం ఎనైసోప్లియె లేదా బివేరియా బాసియాన లేదా ఈపీఎన్ 5 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి సాయంకాలం వేళలో పిచికారి చేయాలి.

కత్తెర పురుగు అదుపు కావడం లేదు

- ఆవుల రాజు, మొక్కజొన్న రైతు, జాగీర్‌పల్లి



నాలుగు ఎకరాల భూమిలో మొక్కజొన్న పంట సాగు చేశాను. విత్తనాలు వేసినప్పటి నుంచి అన్ని జాగ్రత్తలు తీసుకున్నాను. మొక్కజొన్న ఏపుగా పెరిగి పీచు దశకు వచ్చింది. ఈ దశలో కత్తెర పురుగు సోకి ఆకులు, చెట్లను పూర్తిగా తింటోంది. మూడు సార్లు పురుగు మందు స్ప్రే చేశాను. అయినా అదుపు కావడం లేదు. అధికారులు స్పందించి కత్తెరపురుగు అదుపు చేసేందుకు తగిన మార్గం చూపించాలి.

కరీంనగర్‌లో కాషాయ జెండా ఎగురవేస్తాం..

(5వ పేజీ తరువాయి)

నిధులు తీసుకువస్తే ఆ సొమ్మును ఎమ్మెల్యే దండుకున్నాడని విమర్శించారు. ఎమ్మెల్యే కమలాకర్ టెండర్లు, కమీషన్లు తీసుకున్నారని, ఆయన బినామీలతోనే అన్ని రకాల కాంట్రాక్టు పనులు చేయిస్తూ దోచుకున్నారన్నారు. స్మార్ట్‌సిటీ నిధులు బండి సంజయ్ తెచ్చారని వాస్తవాలు చెబితే గంగులకు ఎందుకు కోపమని అన్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు, ఎంపి, మంత్రి బండి సంజయ్ కుమార్‌కు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందని, బండి సంజయ్ ఏనాడూ పైసలు అడుగలేదని తెలిపారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మందు తాగించి, డిన్నర్ పార్టీలు పెట్టి బతిమిలాడడంతోనే పలువురు కార్పొరేటర్లు బీఆర్ఎస్‌లోనే ఉన్నారని, త్వరలోనే వారంతా బీజేపీలో చేరుతారన్నారు.

ఆర్టీసీని నిర్వీర్యం చేస్తే ఊరుకునేది లేదు

● సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రివెంకటస్వామి

భగత్‌నగర్, జనవరి (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని నిర్వీర్యం చేస్తే సీపీఐ చూస్తూ ఊరుకోదని జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. శనివారం కరీంనగర్ ఆర్టీసీ-2 డిపోను జేబీఎం సంస్థకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ పేరుతో కరీంనగర్ టూ డిపోను జేబీఎం సంస్థకు అప్పగించారన్నారు. వాటిని తక్షణమే వెనక్కి తీసుకొని ఆర్టీసీ పరిధిలోనే నిర్వహణ ఉండాలన్నారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సు రూట్‌లలో సూపర్ లగ్జరీ బస్సులను నడపిస్తూ మహిళలకు ఉచిత బస్సుప్రయాణం లేకుండా మహాలక్ష్మి పథకాన్ని నీరుగారుస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రైవేట్ సంస్థలకు అప్పగించిన డిపోలను తిరిగి ఆర్టీసీ సంస్థకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్‌కుమార్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, ఫైడిపల్లి రాజు,కిన్నెరమల్లవ్వ, పిట్టల సమ్మయ్య, బామండ్లపల్లి యుగేందర్ ఉన్నారు.

గణతంత్ర దినోత్సవ కవాతుకు

సెయింట్‌పాల్స్ స్కౌట్స్, గైడ్స్ ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపల్ మోటుపల్లి లీనా ప్రియదర్శిని, స్కౌట్ మాస్టర్ మల్లేశం, గైడ్ కెప్టెన్ సుమలత

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించనున్న జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవ కవాతులో జిల్లా కేంద్రంలోని సెయింట్ పాల్స్ పాఠశాల స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు పాల్గొనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మోటుపల్లి లీనా ప్రియదర్శిని తెలిపారు. ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల్లో విశేష ప్రతిభచాటిన పాఠశాల స్కౌట్ విద్యార్థి సుంకె గుణదీప్, గైడ్ విద్యార్థిని చెలిమెల శివాని జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవ కవాతుకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ మోటుపల్లి రాజ్‌కుమార్, స్కౌట్ మాస్టర్ గంగారపు మల్లేశం, గైడ్ కెప్టెన్ గంగారపు సుమలత, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బ్రహ్మోత్సవాల్లో అందరూ భాగస్వాములు కావాలి

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మార్కెట్ ఏరియా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని, బ్రహ్మోత్సవాలలో అందరూ భాగస్వాములు కావాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అనంతరం వచ్చే నెల నుంచి జరగబోయే స్వామి వారి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, నియోజక వర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో వర్గాలు. రాజకీయాల జోలి రావద్దని అన్నారు. ఆలయ ఈవో సుధాకర్, ఇతర అధికారులు అందరికీ సమాచారం అందించే సమావేశంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్‌లతోపాటు ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి బ్రహ్మోత్సవాలకు ఐదు లక్షల రూపాయలు ఇస్తున్నట్లు ప్రకటించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, పురుమల్ల శ్రీనివాస్ చెరో లక్ష రూపాయలు ప్రకటించారు.

సీపీఎం జెండా ఆవిష్కరణ

ఇల్లందకుంట: సీపీఎంరాష్ట్ర 4వమహాసభల సందర్భంగా మండల కేంద్రంలో సీపీఎంజెండాను మండలకార్యదర్శి చెల్పూరిరాము శనివారం ఆవిష్కరించారు.మహాసభలుఈనెల25నుంచి28వరకుసంగారెడ్డిలోజరుగుతున్నాయన్నారు.

కుటిల రాజకీయానికి తెరలేపిన బండి సంజయ్

● సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జెండాలు పక్కనపెట్టి కరీంనగర్ అభివృద్ధే ఎజెండాగా పనిచేస్తానని ప్రకటించిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ శుక్రవాకం కరంనగర్‌లో జరిగిన అభివృద్ధి పనులు కార్యక్రమాన్ని బీజేపీ పార్టీ సభగా మార్చి ప్రజలను తప్పుదోవపట్టించారని సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి విమర్శించారు. శనివారం ఆర్అండ్‌డీ గెస్టహౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై ఫైర్ అయ్యారు. జండాలు పక్కకు పెడుదాం.. అభివృద్ధి జండా పడుదాం... అన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్.. హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించిన అభివృద్ధి సభను బీజేపీ ఎన్నికల ప్రచార సభ మాదిరిగా నగరంలో ఫ్లెక్సీలు కట్టి, హోర్డింగులతో నింప డమే నిదర్శనం అన్నారు. ఎంపీగా ఉన్నప్పుడు బండి సంజయ్‌కి అభివృద్ధి గుర్తుకు రాలేదని, స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అకస్మాత్తుగా నగర ప్రజలపై సవతి తల్లి ప్రేమను ఒలకబోసినట్టు ఇప్పుడు అకస్మాత్తుగా జ్ఞానోదయం కలగడం హాస్యా స్పదమన్నారు. సభ సక్సెస్ అయినా.. సంజయ్ సఫలం కాలేదని చెప్పారు. సుమారు 800 కోట్ల రూపాయలతో స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనులు జరగగా ఇందులో కేంద్రం వాటా 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 50 శాతం ఉంటుందని తెలిపారు. కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే స్మార్ట్‌సిటీ అభివృద్ధి జరిగినట్టుగా ప్రజలను కేంద్రమంత్రిగా ఉన్న బండి సంజయ్ మభ్యపెట్టడం



సమావేశంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

సిగ్గుచేటు అన్నారు. ప్రొటోకాల్ అంశంలో అధికారుల నిర్లక్ష్య వైఖరి సరికాదని, ఇది మరోసారి పునరావృతం కాకుండా జిల్లా అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. సంక్షేమ పథకాల దరఖా స్తుల స్వీకరణలో స్వల్పంగా లోటుపాట్లు చోటు చేసుకుంటే దాన్ని భూతద్దంలో పెట్టి చూడటం ప్రతిపక్షాల బుద్ధిహీనత్వానికి నిదర్శనం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండటి శ్రీనివాస్‌రెడ్డి, మామిడి సత్యనారాయణరెడ్డి, నర్సిరెడ్డి, తమ్మిడి ఎజ్రా, కుర్ర పోచయ్య, కీర్తి కుమార్, కొట్టె ప్రభాకర్, అజయ్, మసుమ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే గంగుల

భగత్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని రేకుర్తిలో పలు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. 18వ డివిజన్ కాశోజి నగర్ స్వాగత తోరణంతో పాటు, 19వ డివిజన్ రేకుర్తి లక్ష్మీనర్సింహస్వామి గుట్ట పైకి ఘాట్‌రోడ్‌ను ప్రారంభించారు.

● కరీంనగర్ కల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ సంస్కృత పండితుడు, పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథి పేరిట నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ కాపువాడ చౌరస్తా నుంచి బొమ్మకల్ రోడ్ వరకు రహదారిని శ్రీభాష్యం విజయసారథి మార్గ్‌గా ఏర్పాటు చేశారు. మార్గ్‌ను ఎంఎల్ఏ గంగుల కమలాకర్ ప్రారంభించారు.

మేయర్ సునీల్‌రావు అక్రమ ఆస్తులపై విచారణ చేయాలి

కరీంనగర్ టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనుల్లో జరిగిన అవినీతి అక్రమాలతో పాటు మేయర్ యాదగిరి సునీల్‌రావు అక్రమ ఆస్తులపై విచారణ జరిపించి మేయర్ సునీల్‌రావుపై కేసు నమోదు చేసి శిక్షించాలని 49వ డివిజన్ కార్పొరేటర్ కమల్‌జిత్ కౌర్ ఏసీబీ ఉన్నతాధికారులకు, ఈఎన్‌సీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

సామాన్యుడి ఆయుధం ఓటుహక్కు



ర్యాలీ ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



వీణవంకలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

కరీంనగర్ అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య దేశంలో సామాన్య పౌరుడి అసామాన్య ఆయుధం ఓటుహక్కు అని, ఎన్నికల వేళ ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ప్రఫుల్ దేశాయ్ పేర్కొన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియం నుంచి భగత్‌సింగ్ బొమ్మ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీకిరణ్, ఇంచార్జి డీఆర్ఓ పవన్ కుమార్, ఆర్డీఓ మహేశ్వర్, డీడబ్ల్యుఓ సబిత, డీఆర్డీఓ శ్రీధర్, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, డీవైఎస్ఓ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి,పీడీ వేణుమాధవరెడ్డి పాల్గొన్నారు.

● కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రిన్సిపల్ టి మాలతి ఆధ్వర్యంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు.

● గణేష్‌నగర్: సమర్ధవంతమైన సమాజం కోసం ఓటును సరైన విధంగా వినియోగించుకోవాలని ఎస్ఆర్ఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి నితిన్‌కుమార్ అన్నారు. శనివారం ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఓటర్ల దినోత్సవంలో మాట్లాడారు.

●హుజూరాబాద్/శంకరపట్నం/వీణవంక/ఇల్లందకుంట/గంగాధర/చొప్పదండి/సైదాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్, శంకరపట్నం, వీణ వంక, ఇల్లందకుంట, గంగాధరలలో జాతీయ ఓటర్ దినోత్సవంను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కనకయ్య, ఆర్ఐలు రంజిత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ దేశభవిష్యత్తును నిర్ణయించేది ఓటేనని తెలిపారు. చొప్పదండి నవోదయ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిధిగా హాజరుకగా మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. సైదాపూర్ మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు మాక్‌పోలింగ్ నిర్వహించారు.

సునీల్‌రావు రాజీనామాతో బీఆర్ఎస్ శని వదిలింది

● బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కరీంనగర్ టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మేయర్ యాదగిరి సునీల్‌రావు పెద్ద అవినీతి తిమింగలం ఆయన బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడం పార్టీకి శని వదిలి నట్లయిందని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. శనివారం నగరంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదు నెలల క్రితమే తాము సునీల్‌రావు బీజేపీలో చేరుతారని చెప్పామన్నారు. ఎప్పటికీ అధికార పార్టీలో ఉండాలని, నమ్మిన మనిషిని వెన్నుపోటు పొడవడం ఆయన నైజమని అన్నారు. 2020 మున్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సహకారంతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు అధిక సంఖ్యలో గెలువగా దొడ్డిదారిన మేయరైన చరిత్ర నీది మరిచిపోయావా అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై అసత్యపు ఆరోపణలు చేస్తే ఊరుకోమన్నారు. కార్పొరేటర్లు వంగపల్లి రాజేందర్‌రావు, గందె మాధవి, దిండిగాల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చల్ల హరిశంకర్, పాల్గొన్న డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

గణేష్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ టౌన్-1 సబ్ డివిజన్ పరిధిలోని టౌన్-3 సెక్షన్‌లో 33/11 కెవి బ్యాంక్ కాలనీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. పర్యవేక్షక ఇంజనీర్ మేక రమేష్, డీఈ జంపాల రాజం పర్యవేక్షణలో ఐదు ఫీడర్‌లకు రేకుర్తి, వావిలాలపల్లి, అంబేద్కర్‌నగర్ సబ్‌స్టేషన్‌ల నుంచి ప్రత్యామ్నాయంగా సరఫరా అందించారు. ఈ కార్యక్రమంలో టౌన్-1 ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్, ఏఈ వెంకటరమణయ్య, సబ్‌ఇంజనీర్ రేకుల రాజు సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న అన్వర్‌ఖాన్

అన్వర్‌ఖాన్‌కు ఉత్తమ కరాటే మాస్టర్ పురస్కారం

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన గోజీరాయ్ ఇంటర్నేషనల్ కరాటే మాస్టర్ అన్వర్‌ఖాన్ ఉత్తమ కరాటే మాస్టర్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ నెల 21న హైదరాబాద్ నాంపల్లిలోని బిర్లా ఆడిటోరియంలో జరిగిన అంతర్జాతీయ కరాటే మాస్టర్ల సమావేశంలో ఈ అవార్డును ఆయన సుప్రీంకోర్టు జడ్జి చేతులమీదుగా అందుకున్నట్లు గోజిరాయి కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ అక్బర్‌ఖాన్, ఫహమీద ఖాతూన్ తెలిపారు. అలాగే అవార్డులను అందుకున్న వీరిని శ్రీధర్, పి జయధర్, ఎస్ చరణ్, మౌనిక తదితరులు అభినందించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు

ఇల్లందకుంట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు అన్నారు. శనివారం మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలోని కస్తూర్బా గాంధీబాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. పాఠశాలలోని స్టాక్‌రూమ్, వంటగదిని పరిశీలించి సిబ్బందికి సూచనలుచేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పిల్లలు తయారు చేసిన బ్యాడ్జీలను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో మండలవిద్యాధికారి రాములు, పాఠశాల ప్రత్యేకాధికారి లావణ్య, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓబన్న విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

రామడుగు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహ నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓబన్న ఆశయసాధన కోసం వడ్డెర కులస్తులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దున్నపోతులరాజు, గోపాల్‌రావుపేట ఏఎంసీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల ఉన్నారు.

చొప్పదండి: పట్టణంలోని పలువార్డుల్లో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం భూమిపూజ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గసభ్యుల వీడ్కోలు సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండ.. కల్యాణలక్ష్మి : ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ఆడపడుచులకు ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థికంగా అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎఎల్‌ఎండీ కాలనీలోని క్యాంపుకార్యాలయంలో మండలానికి చెందిన 20మందిలబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు రాకేష్, మండల కాంగ్రెస్‌అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు సుదగోని లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇప్పించలేదు..

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్‌బాబు

జమ్మికుంట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా ఎమ్మెల్సీగా, ప్రభుత్వవిప్‌గా ఉన్న కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్ ప్రాంతంలో ఒక్క డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు కూడా ఎవరికీ ఇప్పించలేదని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితల ప్రణవ్‌బాబు అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కరోజు కూడా గ్రామ సభలు ఏర్పాటు చేయలేదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే కౌశిక్‌రెడ్డి వీధిరౌడీలా ప్రవర్తిస్తున్నాడని మండిపడ్డారు. అంతకు ముందు మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, కౌన్సిలర్ల పదవికాలం ముగిసిన సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు.

మున్సిపల్ పాలకవర్గాన్ని సన్మానించిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్/ఇల్లందకుంట/వీణవంక,జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో పాలకవర్గ పదవీ విరమణ సన్మానోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లలో కౌన్సిలర్లు తమ వార్డుల్లోని ప్రజలకు మెరుగైన సేవలందించారన్నారు. మున్ముందు కూడా ఇలాగే ప్రజలకు సేవచేయాలని కొనియాడారు. అనంతరం 30మంది కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, చైర్‌పర్సన్ గందె రాధిక, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. ఇల్లందకుంట, వీణవంక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను శనివారం పంపిణీ చేశారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా పోరాటం

● టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జాతీయకార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్

హుజూరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల ఇళ్ల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాటం చేయడానికి సిద్ధం కావాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జాతీయ కార్యవర్గసభ్యుడు నగునూరి శేఖర్ పిలుపునిచ్చారు. శనివారం హుజూరాబాద్‌లోని సాయి కన్వెన్షన్‌లో ప్రెస్‌క్లబ్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిగా హాజరైన ఆయన మాట్లాడుతూ హుజూరాబాద్, కరీంనగర్‌లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించగా, కాంగ్రెస్‌ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు.

ఈ సమస్యపై పలుమార్లు మంత్రులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇళ్ల స్థలాల కోసం శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని, అప్పటికి సమస్య పరిష్కారం కాకపోతే దీక్షలు కొనసాగిస్తామన్నారు. అనంతరం నగునూరి శేఖర్, గాండ్ల శ్రీనివాస్, రవీందర్, చంద్రశేఖర్‌ను ప్రెస్‌క్లబ్ సభ్యులు సత్కరించారు.

కార్యక్రమంలో జిల్లాఅధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎలగందుల రవీందర్, ప్రెస్‌క్లబ్ కన్వీనర్ గడ్డం ధర్మారెడ్డి, కో-కన్వీనర్లు కాయిత రాములు, నిమ్మటూరి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

● కరీంనగర్ రూరల్: మండల ప్రత్యేక అధికారి ఆర్డీవో మహేశ్వర్ జనవరి 26నుంచి అమలు చేయబోయే సంక్షేమ పథకాలను బహదూర్‌ఖాన్‌పేటలో లాంఛనంగా ప్రారంభించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించనున్నట్లు ఎంపీడీఓ సంజీవరావు తెలిపారు.

● సుభాష్‌నగర్: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తలపెట్టిన లక్ష డప్పులు, వేయి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ మాస్టిన్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్ర అధ్యక్షుడు నాగెల్లి నర్సయ్య పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు.

● గణేష్‌నగర్: నగర మేయర్ సునీల్ రావు బీఆర్ఎస్‌ను వీడడంతో ఆ పార్టీ మైనార్టీ శాఖ ఉద్యమకారుల ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ చౌక్‌లో సంబురాలు నిర్వహించారు. మాజీ కో-ఆప్షన్‌సభ్యుడు జమాలుద్దీన్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

● కరీంనగర్ అర్బన్: ప్రజలకు అవగాహన పెంచినప్పుడే మానసిక ఆరోగ్యం చేకూరుతుందని మానకొండూర్ శాసన సభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన ఇండియన్ సైకియాట్రిక్ సమ్మిట్‌లో మాట్లాడారు.

● భగత్‌నగర్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యత గల పౌరులుగా వ్యవహరించాలని రోడ్ ట్రాన్స్ పోర్ట్ అథారిటీ సభ్యుడు పడాల రాహుల్ అన్నారు. శనివారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు.

● కరీంనగర్ రూరల్: మాఘమాసం సందర్భంగా కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గ భవానీ ఆలయంలో ఈనెల 29 నుంచి ఫిబ్రవరి6వ తేదీ వరకు ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో శైశిర నవరాత్రులు నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్ తెలిపారు.

● గణేశ్‌నగర్: శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్ఎండీ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు ఉమేష్‌కుమార్ శనివారం ప్రారంభించారు.

● కరీంనగర్ అర్బన్: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని ప్రభుత్వ గిరిజన కళాశాల(బాలికల) వసతి గృహంలో జిల్లా న్యాయ సేవాఅధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె వెంకటేష్ అవగాహన నిర్వహించారు.

● భగత్‌నగర్: పేదల పక్షాన సీపీఎం ఉద్యమిస్తుందని జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవన్‌లో మాట్లాడారు.

● చిగురుమామిడి: మండలంలోని ఉల్లంపల్లి గ్రామానికి శనివారం ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. బస్సు కోసం గ్రామస్థులు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించగా ఆయన ఆదేశాల మేరకు శనివారం ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రికి గ్రామ నాయకులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

● గణేష్‌నగర్: ఈ నెల 28న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఫెరియా పిస్టా ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

● గంగాధర: మండలంలో 2కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి కేంద్రమంత్రి బండిసంజయ్ రూ.కోటి55లక్షలు మంజూరు చేయగా బీజేపీ నియోజకవర్గకన్వీనర్ పెరుక శ్రవణ్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

● మానకొండూర్: అమలు కాని హామీలతో ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకటరెడ్డి ఆరోపించారు.

● తిమ్మాపూర్: మక్తపల్లిలోని రైతులు పొలాలకు సాగునీరు రావడంలేదని డీ4 ఉపకాలువ వద్ద నిరసన తెలిపారు.

● చొప్పదండి: మండలంలోని ఆర్నకొండలో బీజేపీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

● హుజూరాబాద్: ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేసి, పీఆర్సీ ప్రకటించాలని డీటీ ఎఫ్ రాష్ట్ర ఆడిట్‌కమిటీ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి అన్నారు.

-వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎంవీఐ కంచివేణు అన్నారు. శనివారం హుజూరాబాద్‌లో లారీ అసోసియేషన్ డ్రైవర్లకుజాతీయ రోడ్డుభద్రత మాసోత్సవంలో భాగంగా అవగాహన కల్పించారు.

● హుజూరాబాద్‌లీగల్: రిపబ్లిక్‌డే సందర్భంగా కోర్టు ఆవరణలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గోస్కుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించారు.

●హుజూరాబాద్‌రూరల్: సింగాపూర్‌లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎస్‌వంశీకృష్ణకు డాక్టరేట్ వచ్చినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ కెశంకర్ ఒకప్రకటనలో తెలిపారు.

- మండలంలోని పెద్దపాపయ్యపల్లిలోని జడ్పీపాఠశాలలో పదోతరగతి చదువుతున్న వైహర్షిణి ఓటరుదినోత్సవంపై నిర్వహించిన వ్యాసరచనపోటీల్లో ప్రతిభచాటి మండలంలో ప్రథమస్థానంలో నిలిచింది.

- వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా లక్ష్యంగా టీఎస్ ఎన్‌పీడీసీఎల్ పనిచేస్తుందని డీఈ ఉపేందర్ అన్నారు.

●హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన వడ్లూరి సుదర్శన్‌కుమారుడు వేదార్థ లవ్లెస్‌లవ్ అనేపుస్తకాన్ని రాసి వరల్డ్ బుక్ ఆఫ్ అవార్డు సాధించాడు.